www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 10-6-2024
Guntur | Vijayawada Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | గుంటూరు సిటీ


పెమ్మసానికి కేంద్ర మంత్రి పదవి ఇవ్వడంతో గుంటూరులో టీడీపీ శ్రేణుల ర్యాలీ

పెమ్మసాని.. అనే నేను



- ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము
- కలిసొచ్చిన అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం
- ఏపీ రాజకీయాల్లో తొలి అడుగే సంచలనం

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్.. ఓ సంచలనం. ఓ ప్రభంజనం. తొలి అడుగు పేరుతో రాజకీయ రంగ ప్రవేశం చేసి సంచలనం సృష్టించారు. నామినేషన్‌తోనే హోరెత్తించారు. ఆస్తుల ప్రకటనతో జాతీయ స్థాయి దృష్టిని ఆకర్షించారు. గుంటూరు లోక్‌సభ చరిత్రలో 3.44 లక్షల భారీ ఓట్ల మెజార్టీతో విజయఢంకా మోగించారు. తొలి అడుగే కేంద్ర మంత్రిగా గుంటూరు వాణిని లోక్ సభలో వినిపించే అవకాశం దక్కించుకున్నారు. పెమ్మసాని అనే నేను.. పేరుతో ఎన్నికలకు ముందు గుంటూరు లోక్‌సభ పరిధిలో పెద్దఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ అన్నట్లుగానే ఆదివారం ప్రధానమంత్రి మోదీతో కలిసి రాష్ట్రపతి భవన్‌లో కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అమెరికా నుంచి నేరుగా గుంటూరు జిల్లా కు వచ్చిన పెమ్మసాని కూటమి అభ్యర్థిగా టీడీపీ తరపున ఎంపీ టిక్కెట్ దక్కించుకుని ప్రజల్లోకి వెళ్లారు. అఖండ మె జార్టీ సాధించారు. పైగా అంతర్జాతీయంగా వైద్యరంగంలో ఆయనకున్న పేరు ప్రతిష్ఠలు మోదీ మంత్రివర్గంలో స్థానం సంపాదించేలా చేశాయి.

బుర్రిపాలెం నుంచి అమెరికాకు..

గుంటూరు జిల్లా తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని సాంబశివరావు, సువర్చల కుమారుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్. తండ్రి సాంబశివరావు వ్యాపార రీత్యా నరసరావుపేటలో స్థిరపడ్డారు. చంద్రశేఖర్ పదో తరగతి వరకు నరసరావుపేట మున్సిపల్ స్కూల్‌లో, ఇంటర్మీడియట్ గుంటూరులో అభ్యసించారు. ఎంసెట్‌లో 60 వేల మంది విద్యార్థులతో పోటీపడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. పీజీ చదివేందుకు అమెరికా వెళ్లిన ఆయన అక్కడి యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామ్(యూఎస్ఎంఎల్ఈ) పూర్తి చేయడంలో వసతి, శిక్షణకు అధిక వ్యయభారం వంటి అనేక సమస్యలను ఎదుర్కొన్నారు. కేవలం శిక్షణ ఖర్చు లెక్కిస్తే 2001లో నాటి అమెరికా లెక్కల ప్రకారమే 5 వేల డాలర్లు. గ్రామీణ ప్రాంతాల నుంచి అమెరికాకు కోటి ఆశలతో వచ్చి ఎన్నో వ్యయప్రయాసలకు లోనయ్యే పేద విద్యార్థులు ఎవరూ భవిష్యత్తులో తనలా ఇబ్బందులు పడకూడదని పెమ్మసాని భావించారు. తాను శిక్షణ కోసం రూపొందిం చుకున్న మెటీరి యల్‌ను ముద్రించి అందరికీ ఉపయోగపడేలా చేశారు. తన సతీమణి డాక్టర్ శ్రీరత్న, సోదరులు రవిశంకర్, కోనేరు శ్రీకాంత్‌ల సహకారంతో మెటీరియల్‌ను పుస్తకరూపంలో కంప్యూటరీకరించి అంతర్జాలంలో పెట్టారు. వైద్య విద్యారంగం నుంచి దానికి స్పందన లభించింది. పెమ్మసాని తన పీజీ జనరల్ గైసింగర్ వైద్య కేంద్రం నుంచి పూర్తి చేయడమే కాకుండా అక్కడ కూడా అత్యధిక మార్కులు సాధించి అమె రికాలో సైతం తన ప్రతిభను చాటుకున్నారు. పీజీ శిక్షణ సమయంలో సైతం అమెరికాలో జరిగిన వైద్య విద్య విజ్ఞాన పోటీల్లో వరుసగా రెండుసార్లు అవార్డులు అందుకున్నారు. తదనంతరం జాన్స్ హోప్కిన్స్ యూనివర్సిటీలోని సైనై హాస్పిటల్‌లో ఐదేళ్లు వైద్య విద్యా భోదకుడిగా, ఫిజీషియన్‌గా సేవలందించారు. అమెరికాలో లైసెన్సింగ్ ఎగ్జామ్స్‌కు హాజర య్యే విద్యార్థుల కోసం యూ వరల్డ్ పేరుతో ఆన్‌లైన్ శిక్షణ సంస్థని స్థాపించారు. దీంతో అనతికాలంలోనే ఆయన అమె రికాలో మంచి ఖ్యాతి గడించారు.

అమెరికన్ పౌరసత్వం కాదని..

అమెరికాలో సుదీర్ఘకాలం ఉన్నా అక్కడి ప్రభుత్వం పౌరసత్వం ఇస్తామన్నా తీసుకోలేదు. ఎప్పటికైనా పుట్టిన గడ్డకు సేవ చేయాలన్న సంకల్పం ఆయనలో ఉంది. ప్రజాసేవపై ఆసక్తి ఉన్న డాక్టర్ పెమ్మసాని అమెరికా నుంచే టీడీపీ సంక్షే మ కార్యక్రమాలకు బాసటగా నిలిచారు. ఈ క్రమంలో 2010 నుంచి టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం తరపున పని చేశారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పాదయాత్ర సమయంలో చంద్రబాబునాయుడు స్వయంగా చూశారు. డాక్టర్ పెమ్మసా నిని రాజకీయాల్లోకి వచ్చి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలవా లని చంద్రబాబు ఆహ్వానించారు. చంద్రబాబు కోరిక మేరకు 2014లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీకి సిద్ధ మవగా చివరి దశలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేప థ్యంలో పెమ్మసానికి అవకాశం దక్కలేదు. ఈ దఫా ఎన్నికల్లో గల్లా జయదేవ్ తాత్కాలికంగా రాజకీయాలకు విరామం తీసుకోవడంతో పెమ్మసానికి అవకాశం దక్కింది. ఇప్పటికే నిర్వహించినసేవా కార్యక్రమాలు పెమ్మసానికి ప్లస్ పాయింట్ అయ్యాయి. తొలిసారి లోక్‌సభకు ఎన్నికైనా కేంద్ర మంత్రిగా ప్రజలకు సేవ చేసే అవకాశం పెమ్మసానిని వరించింది.

28 ఏళ్ల తర్వాత ...

గత కొన్ని పర్యాయాలుగా కేంద్ర మంత్రివర్గంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు స్థానం లేకుండా పోయింది. టీడీపీ తరపున 1996లో డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. యూపీయే-1లో బాపట్ల నుంచి ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి, యూపీయే-2లో పనబాక లక్ష్మి కేంద్ర మంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. 2014 నుంచి 19 వరకు పదేళ్లలో జిల్లా నుంచి ఎన్నికైన ఎంపీలలో ఏ ఒక్కరికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కలేదు. మళ్లీ ఇప్పుడు గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ రూపంలో కేబినెట్ బెర్తు లభించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వివిధ రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం తప్పనిసరి. పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలు, మంగళగిరి ఎయిమ్స్‌లో పెండింగ్ పనులకు కేంద్రం సహకారం కావాలి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి హోదాలో డాక్టర్ పెమ్మసాని రాబోయే ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరు జిల్లా రూపురేఖలే మారుస్తారన్న ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తపరుస్తున్నారు.

అధినేతల సమక్షంలో..


కేంద్ర మంత్రిగా ప్రమాణం చేస్తున్న పెమ్మసాని

'డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అనే నేను.. శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతా..' అంటూ ఆంగ్లంలో గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్రపతి భవన్ ముంగిట ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార వేదికపై కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం ఆదివారం చేశారు. ప్రధానమంత్రిగా మూడో సారి ప్రమాణ స్వీకారం చేసిన నరేంద్ర మోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుతో పాటు ఏడు దేశాల అధ్యక్షులు, దేశ, రాష్ట్ర నాయకుల సాక్షిగా ఆయన ఈ ప్రమాణస్వీకారం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం అనంతరం డాక్టర్ పెమ్మసాని స్పందిస్తూ చంద్రబాబు వైపు చూస్తూ నమస్కరించారు. ఆయన ప్రమాణ స్వీకారం చేసినంత సేపు గుంటూరు ప్రజలు టీవీలకు అతుక్కు పోయారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత గుంటూరు లోక్‌సభ స్థానానికి కేంద్ర మంత్రి పదవిని తీసుకొచ్చిన పెమ్మసానికి జిల్లావాసులు, టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

పనులు.. పర్యటనలు

ఐదేళ్లు శ్మశానంలా మారిన రాజధాని అమరావతిలో పనుల హడావుడి.. అధికారుల పర్యటనలతో సందడి నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రాజధాని ప్రాంతం సరికొత్త కళను సంతరించుకుంది. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ రాజధాని గ్రామాల్లో పర్య టించి జరుగుతున్న పనులను పరిశీలించారు.


ఉద్దండ్రాయునిపాలెంలో అమరావతి నమూనాను పరిశీలిస్తున్న సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్


రాజధానిలో ముళ్లకంచెలను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లకు
ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులకు బాధ్యతలు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం విజయవంతంగా నిర్వహించేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన పలువురు అధికారులకు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఆయా అధికారులను తక్షణమే రిలీవ్ చేయాల్సిందిగా కలెక్టర్లకు ప్రభుత్వం నుంచి ఆదివారం ఆదేశాలు అందాయి. పల్నాడు జిల్లా నుంచి గురజాల ఆర్‌డీవో గాజులపల్లి వెంకట రమాకాంత్ రెడ్డి, నరసరావుపేట, సత్తెనపల్లి ఆర్డీవోలు సరోజిని, మురళీకృష్ణ, కేఆర్ఆర్‌సీ పల్నాడు ఎస్‌డీసీ కుముదినిసింగ్, పులిచింతల ఎస్‌డీసీ శ్రీరాములు, డిప్యూటీ కలెక్టర్ కందుల శ్రీరాములును నియమించారు. గుంటూరు ఆర్‌డీవో శ్రీకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ స్వాతి, కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ గంగరాజు, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈడీ గడ్డిపాటి అనీల్‌కుమార్, సీసీఎల్‌ఏ సీఎంఆర్‌వో పీడీ పనబాక రచన, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శిరీష, అదనపు పీఎస్ నాగార్జునరెడ్డి, మెప్మా పీడీ కావేటి వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఏ ఏపీసీ విజయలక్ష్మి, ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ జేఎస్ఆర్ శివరావు, సీసీఎల్ఏ అసిస్టెంట్ సెక్రెటరి వెంకటరత్న సాయిబాబాలను నియమించారు.



డల్లాస్ నగరంలో నిర్వహించిన రామోజీరావు సంస్మరణ సభలో పాల్గొన్న గుంటూరు జిల్లాకు చెందిన ఎన్‌ఆర్‌ఐలు

రామోజీరావు మృతి తెలుగుజాతికి తీరనిలోటు

● కాకతీయసేవాసమితి, డల్లాస్ అమెరికా

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): తెలుగుజాతి కీర్తిని విరజిమ్మిన ఆదర్శ మూర్తి రామోజీరావు అని కాకతీయ సేవాసమితి డల్లాస్ అమెరికా నిర్వాహకులు కొనియాడారు. రామోజీగ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు సంస్మరణ సభను డల్లాస్ నగరంలోని ఫ్రిస్కోలో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు ఎన్నారైలు మాట్లాడుతూ రామోజీరావు సామాన్య రైతు కుటుంబంలో జన్మించి పట్టుదలతో అనేక సంస్థలను స్థాపించి ఎందరికో ఉపాధికల్పించి సమాజసేవ చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. అలాంటి వ్యక్తి మరణం తెలుగు ప్రజలకు తీర్చలేని లోటన్నారు. ఆయన మృతిపై వారి కుటుంబ సభ్యులకు, రామోజీ గ్రూపు సంస్థలలో పనిచేసేవారికి ఎన్నారైలు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.



రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో జైఅమరావతి అంటూ నినాదాలు చేస్తున్న న్యాయవాది రవీంద్ర, రాజధాని మహిళలు, న్యాయవాదులు

రాజధాని అమరావతి రైతుల సేవలు

చరితార్థమైనవి

● సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్ర

తుళ్లూరు, జూన్ 9: అమరావతి రాజధాని రైతుల సేవలు చరితార్థమైనవని సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్ర అన్నారు. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయుపాలెం గ్రామానికి రవీంద్రబాబు, గుంటూరు బార్ అసోసియేషన్ న్యాయవాదు లు, మహిళా రైతులు, రమణా కళాకారుల బృందం సందర్శించారు. మోదీ మూడోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు ఆదివారం ఆయన అమరావతి శంకుస్థాపన చేసిన ప్రదేశానికి రావటం కారణం ఒకటేనన్నారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం సాయం కోరుతున్నామన్నారు. భూములిచ్చిన రైతుల త్యాగాలు, వారి శాంతియుత పోరాటం, కూట మి గెలవటానికి ఒక కారణమని రవీంద్ర ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించామని, చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం అనంతరం రాజధాని అభివృద్ధి పనులు మరింత వేగం గా జరుగుతాయని సీఎస్ నీరబ్‌కుమార్ చెప్పారని రవీంద్ర తెలిపారు.

రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్

● వందకు పైగా జేసీబీలతో శరవేగంగా పనులు

తుళ్లూరు, జూన్ 9: రాజధాని అమరావతిలో జంగిల్ క్లియరెన్స్ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే వందకు పైగా జేసీబీ యంత్రాలు కంప, పిచ్చి చెట్లను తొలగించే పనులలో దుమ్మురేపుతున్నాయి. రాత్రిళ్లు కూడా యంత్రాలు పనులు చేస్తున్నాయి. మాస్టర్ ప్లాన్ ప్రకారం 217 చదరపు కిలోమీటర్ల రాజధాని అమరావతిలో 32 పెద్ద రోడ్లను నిర్మాణం చేయటానికి టీడీపీ ప్రభుత్వం సంకల్పించింది. అవి వివిధ దశలలోకి వచ్చాయి. ఈలోపు వైసీపీ ప్రభుత్వం వచ్చి ఆ పనులు ఆగిపోయాయి. ఆయా రోడ్డు వెంట ముళ్లపొదళ్లను యంత్రాలు తొలగిస్తున్నాయి. ప్రధాన రోడ్ల నిర్మాణం పూర్తి చేసి రైతుల ప్లాట్లలో అభివృద్ధి పనులు చేయటానికి సీఆర్డీఏ అధికారులు ప్రణాళికలు చేస్తున్నారు. ఆదివారం రాజధానిలో భవన నిర్మాణాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ పరిశీలించారు. జంగిల్ క్లియరెన్స్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. స్ట్రీట్ లైట్లు రాజధానిలో వెలుగులు జిమ్మాలని ఆదేశించారు. వైసీపీ ప్రభుత్వం ఆర్-5జోన్‌ను క్రియేట్ చేసి మాస్టర్‌ప్లాన్‌ను విచ్ఛినం చేయటానికి ప్రయత్నించింది. దానిని రైతులు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి అడ్డుకున్నారు. దీనిపై తగిన విధంగా చర్యలు తీసుకుంటామని సీఎస్ పేర్కొన్నారు. సీఆర్డీఏ కమిషనర్ వివేక్‌యాదవ్, ఇంజనీరింగ్ అధికారులు సీఎస్‌తో పాటు ఉన్నారు.



రాజధాని రైతులతో మాట్లాడుతున్న సీఎస్ నీరబ్‌కుమార్



రాజధాని ప్రాంతంలో జంగిల్ క్లియరన్స్ పనులు సాగుతున్న దృశ్యం

పెమ్మసానికి కేంద్రమంత్రి పదవి.. తమ్ముళ్ల సంబరాలు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు పార్లమెంటు సభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయ మంత్రిగా నియమితులైన సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. గుంటూ రు విద్యానగర్ టీడీపీ కార్యాలయం నుంచి కొరిటెపాడు ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పాలా భిషేకం చేసి, కొబ్బరికాయలు కొట్టారు. ఈ సందర్భంగా కనపర్తి మాట్లా డుతూ గుంటూరు పార్లమెంటు నుంచి ఎన్నికైన పెమ్మసానికి మంత్రి పదవి లభించటం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. వేల కోట్ల సంపాదనను వదిలేసి జన్మభూమిపై మమకారంతో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులతో పాటు, అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఏపీలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. మాజీ మంత్రి విడదల రజినితోపాటు ఉమ్మడి జిల్లాలోని వైసీపీ శాసనసభ్యులంతా అధికారాన్ని అడ్డుపెట్టుకొని భారీ అవినీతికి పాల్పడ్డారని, వాటన్నింటిపై విచారణ జరిపి వారి అవినీతి ని ప్రజలముందు పెట్టాలని కోరారు. ముఖ్యంగా అంబటి రాంబాబు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పీజీఎఫ్ కిలారి రోశయ్య, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మానాయుడు, కాసు మహేష్ రెడ్డి, అన్నాబత్తుని శివకుమార్ తదితరులు భారీ అవినీతికి పాల్పడటంతో పాటు టీడీపీ కార్యకర్తలను తీవ్రంగా వేధించి, తప్పుడు కేసులు పెట్టి జైళ్లలో వేయించారని వారిపై విచారణ జరపాలని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో అనేక చోట్ల వైసీపీ నేతలు దౌర్జన్యంగా ఆక్రమించిన స్థలాలు, పొలాలు బాధితులు తిరిగి సొంతం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో కూడా బాధితులకు న్యాయం జరిగే విధంగా నూతన మంత్రులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొమ్మినేని కోటేశ్వరరావు, నూకవరపు బాలాజీ, లంకా ఉదయ్, కిరణ్ రెడ్డి, షేక్ ఖాసీం, పఠాన్ అస్మతుల్లా, గుడిపాటి రమేష్, నున్నా సురేష్, యలవర్తి శ్రీనివాస్, మర్రిపూడి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కనపర్తి శ్రీనివాసరావు తదితరులు



విజేతగా నిలిచిన సెంట్రల్ జోన్ కృష్ణా జిల్లా మహిళల జట్టు

ఏసీఏ సెంట్రల్ జోన్ విజేత కృష్ణా జిల్లా

మంగళగిరి సిటీ, జూన్ 9: ఏసీఏ అండర్-19 మహిళల అంతర్ జిల్లాల ట్రోఫీ విజేతగా కృష్ణా జిల్లా జట్టు నిలిచింది. గుంటూరు జిల్లా పేరేచర్లలో ఆదివారం గుంటూరు, కృష్ణాజిల్లాల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణాజట్టు టాస్‌గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జిల్లా జట్టు 38.1 ఓవర్లలో 118 పరుగులకు ఆలౌటయింది. హాసిని 31, సాయిదీప్తి 22 పరుగులు చేయగా, కృష్ణా బౌలర్ జాస్రా మెహెక్ 28 పరుగులిచ్చి 4 వికెట్లు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కృష్ణా జిల్లా జట్టు 25 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 119 పరుగులు సాధించి ఘనవిజయం నమోదు చేసింది. గౌతమి 50, మెహెక్ 47, లహరి 38 పరుగులు సాధించారు. 6 పాయింట్లతో కృష్ణా విజేతగా నిలవగా, 4 పాయింట్లతో గుంటూరు ద్వితీయ స్థానంలో నిలిచింది.

కారు, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీ

● ఇద్దరు యువకులు మృతి



లోకేష్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)



హర్షవర్ధన్ (ఫైల్‌ఫోటో)

మాచర్ల రూరల్, జూన్ 9: కారు, ద్విచక్ర వాహనం పరస్పరం ఢీకొని ఇరువురు యువకులు మృతిచెందిన ఘటన శనివారం అర్ధరాత్రి మాచర్ల మండలం భైరవునిపాడు సమీపంలో చోటుచేసుకుంది. మాచర్ల పట్టణానికి చెందిన పల్లపోలు లోకేష్‌రెడ్డి (20), కూరపాటి హర్షవర్ధన్ (18) ద్విచక్ర వాహనంపై సాగర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యంలోని భైరవునిపాడు సమీపంలోకి రాగానే ఎదురుగా మాచర్ల వైపు నుంచి వస్తున్న కారు పరస్పర ఢీకొన్నాయి. తీవ్ర గాయాలపాలైన లోకేష్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా, హర్షవర్ధన్‌ను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ హర్షవర్ధన్ కూడా మృతిచెందారు. కాగా మృతులు లోకేష్‌రెడ్డి బీటెక్ చదువుతుండగా, హర్షవర్ధన్ ఇంటర్మీడియట్ ఫస్టియర్ పూర్తిచేశాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సందేశాత్మకంగా నాటిక పోటీలు

పొన్నూరుటౌన్, జూన్9: పొన్నూరు కళాపరిషత్ ఆధ్వర్యంలో 2 వ రోజు నాటికల పోటీలు సదేశాత్మకంగా సాగాయి. కంచర్ల సూర్య ప్రకాశ్ రచనలో కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో హైదరాబాద్ కళాంజలి వారి రైతే రాజు నాటికను ప్రదర్శించారు. రెండ నాటికగా చిలకలూరిపేట డి అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యాడనున్నాడో, ఎక్కడున్నాడో నాటికను ప్రదర్శించారు. మూడో నాటికగా శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి కౌశల్య, సుప్రజ, రామ అనే నాటికను ప్రదర్శించారు. హైదరాబాద్‌కు చెందిన రేటూరి తరణి, చెల్లాదేవాంషి నాయుడు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం ఆకట్టుకుంది. ఆహ్వాన నాటక పోటీలను తిలకించేందుకు పొన్నూరు, పరిసర ప్రాంతాలకు చెందిన నాటక రంగప్రియులు నాటిక పోటీలకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



నాటిక పోటీలలోని ఒక సన్నివేశం

కానిస్టేబుల్‌పై దాడి..

● ఇద్దరు యువకులు అరెస్టు

చిలకలూరిపేట, జూన్ 9: చిలకలూరిపేట అర్బన్ పరిధిలో సీఆర్ కాలనీకి సమీపంలో రెండు రోజుల కిందట పోలీసు కానిస్టేబుల్‌పై దాడి సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అర్బన్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం నాదెండ్ల పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కోట వెంకట నాగ మహేంద్ర విధులు ముగించుకొని తన ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. ఆ సమయంలో ముగ్గురు యువకులు మద్యం తాగి బైక్‌పై కానిస్టేబుల్‌కు ఎదురు వచ్చారు. కానిస్టేబుల్‌ను చూసి భయపడిన ఆ యువకులు బైక్‌పై నుంచి కిందపడ్డారు. కానిస్టేబుల్ సమీపంలోకి వచ్చాక నీవలనే మేం కిందపడ్డాం అని కానిస్టేబుల్‌తో పేచీకి దిగారు. అనంతరం వారు అతడిని రాళ్లతో కొట్టారు. గాయపడిన కానిస్టేబుల్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈ కేసులో దాడి చేసిన మార్టూరు మండలం ఇసుక దర్శికి చెందిన ఇద్దరు సోదరులు మొలతోటి రాము, మొలతోటి లక్ష్మణ్‌లను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అర్బన్ ఎస్ఐ జీ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెలుగుచూస్తున్న ఎంఈవో బాగోతాలు

● సేఫ్ షాప్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్

● ఉపాధ్యాయులను బలవంతంగా మార్కెటింగ్ రొంపిలోకి ..

పొన్నూరుటౌన్, జూన్9: ప్రభుత్వం ఉద్యోగంలో ఉండి వైసీపీకి అంటకాగుతూ సోషల్ మీడియాలో ఫేక్ పోస్టులు పెట్టిన విద్యాశాఖ అధికారి ఉదంతం పొన్నూరు ప్రాంతంలో సంచలనంగా మారింది. ఎంఈవో శోభచంద్ ప్రైవేటు వ్యాపారం నిర్వహించడాని ఉపాధ్యాయ సంఘాలు తాజాగా వెలుగులోకి తీసుకువచ్చాయి. సేఫ్ షాప్ అనే మల్టీలెవల్ మార్కెటింగ్ కంపెనీలో చేరటమే కాకుండా ఆ సంస్థ వ్యాపార కార్యకలాపాల్లో చేరాలని తన పరిధిలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బలవంతపెట్టి ఒత్తిడిపెట్టి చేర్చినట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ వ్యాపారంలో చేబ్రోలుకు చెందిన ఓ ఉపాధ్యాయుడు, వడ్డిముక్కల గ్రామంలో పనిచేస్తున్న మరో ఉపాధ్యాయుడిని వినియోగించుకుని ఉపాధ్యాయులపై వత్తిడి చేయటమే కాకుండా వారిని ఈ వ్యాపారంలోకి భాగస్వాములుగా చేర్చుకున్నారు. ఈ వ్యాపారంలో ముందంజలో ఉన్న ఎంఈవోకు సదరు సేఫ్ షాప్ వ్యాపార సంస్థ విదేశీ ప్రయాణ సౌకర్యాలను ఉచితంగా కల్పించినట్లు సమాచారం. ఈ సంస్థ ద్వారా ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ యానం చేసినందుకే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదుల అందాయి. ఈ ఫిర్యాదులు ఆధారంగా ఆర్‌జేడి షోకాజ్ నోటీలు జారీ చేశారు. తనకు ఉన్న పలుకు బడిని ఉపయోగించి విద్యాశాఖ ఉన్నతాధికారులపై వత్తిడి తేవటంతో కేవలం ఇంక్రిమెట్లు కట్ చేసి చర్యలు ఉపక్రమించకుండా విద్యాశాఖ అధికారులు మిన్నకుండి పొయ్యారని ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి.

టీడీపీ నేత ఇంటిపై దాడికి యత్నం

తుళ్ళూరు, జూన్ 9: దళిత టీడీపీ నేత పులి చిన్నా ఇంటిపైకి శనివారం రాత్రి పది గంటల సమయంలో వైసీపీ శ్రేణులు దాడికి ప్రయత్నించారు. ఈ మేరకు ఆదివారం చిన్నా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాపట్ల మాజీ ఎంపీ నందింగం సురేష్ అనుచరులతో తనకు ప్రాణహాని ఉందని, గతంలో కూడా దాడి చేశారని చిన్నా ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి మీదకు వచ్చినా పోలీసులు ఉండి కూడా వారించలేకపోయారు. నందింగం సురేష్ కుటుంబ సభ్యులు, అనుచరులు అడ్డగోలుగా ఉద్దండ్రాయునిపాలెంలో వ్యవహరిస్తున్నారని చిన్నా తెలిపారు. తుళ్ళూరు సీఐ సుభానికి ఫిర్యాదును అందజేశానన్నారు. ఇంటి మీదకు వచ్చిన దృశ్యాలు వీడియోలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయని పోలీసులకు అందజేశానని చెప్పారు.

ప్రబలిన డయేరియా.. ఒకరు మృతి

● చికిత్స పొందుతున్న మరో ముగ్గురు..



చినచంద్రయ్య (ఫైల్)

రెంటచింతల, జూన్ 9: రెంటటచింతల వడ్డెర బావి సమీపంలో డయేరియా ప్రబలింది. ఒకే బజారులో వాంతులు, విరేచనాలుతో బాధపడుతుండగా అందులో ఓ వ్యక్తి ఆదివారం వేకువ జామున మృతి చెందాడు. మరో ముగ్గురు మాచర్ల ,పిడుగురాళ్లలోని ప్రయివేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. సేకరించిన వివరాలిలా వున్నాయి.. కాలనీకి చెందిన పేరూరి చిన చంద్రయ్య(72) శనివారం మధ్యాహ్నం నుంచి వాంతులు విరేచనాలతో బాధపడు నీరసించి ఆదివారం వేకువ జామున ప్రాణాలిడిచారు. అతని ఇంటికి ఎదురుగా వున్న యామర్తి తిరుపతమ్మ ఆమె కూతురు హవేలీ కూడా డయేరియా బారిన పడ్డారు. వెంటనే పిడుగురాళ్లకు తరలించి ప్రయివేట్ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు. ఆత్మకూరి లక్ష్మయ్య కూడా వాంతులు, విరేచనాలతో బాధపడుతుంటే శనివారం రాత్రి మాచర్లకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తున్నారు. పంచాయతీ ఓవర్ హెడ్ ట్యాంక్‌లో పాకుడు పట్టి ఉందని పలువురు చెబుతున్నారు. తక్షణమే స్పందించి మెడికల్ క్యాంప్ నిర్వహించి డయేరియా వ్యాపించకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీ, వైపీసీ శ్రేణుల మధ్య ఘర్షణ

● ఇరు వర్గాల వారిపై కేసులు

రాజుపాలెం,జూన్9:మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పులిబండ్ల సాంబశివరావు స్థానికంగా ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూర్చొని ఈనెల 12వ తేదీన జరగనున్న నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవ ఏర్పాట్లపై పార్టీవారితో చర్చిస్తున్నారు. అదే సమయంలో దంతాల వెంకటేష్, పులిబండ్ల అవినాష్‌లు కార్యాలయం వద్దకు వచ్చి గొడవపడగా అవినాష్ తరుపున బంధువులు కార్యాలయం వద్దకు వచ్చి వెంకటేష్‌పై దాడికి దిగారు. మాకార్యాలయం ముందు గొడవెందుకు చేస్తున్నారని పులిబండ్ల సాంబశివరావు ప్రశ్నించటంతో ఆయనపై కూడా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సాంబశివరావు బంధువులు, అనుచరులు అవినాష్ బంధువులపై దాడి చేశారు. ఇరు పార్టీల వారు ఇచ్చిన ఫిర్యాదుపై మేరకు స్థానిక ఎస్ఐ షామీర్ బాషా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్లంకొండలో టీడీపీ నేతకు తీవ్ర గాయాలు

బెల్లంకొండ: బెల్లంకొండ మండలం మన్నె సుల్తాన్‌పాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. టీడీపీకి చెందిన నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గెలుపొందిన సందర్భంగా గ్రామంలో సంబరాలు జరుపుకుంటున్నారు. అది ఓర్చుకోలేని వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కార్యకర్తలను పదజాలంతో దూషించటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి చెందిన వైసీపీనేత శ్రీనివాసరెడ్డి తలకు, చేతులకు, కాళ్ళకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ రాజేష్ సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాలను చెల్లాచెదురుచేశారు. గ్రామంలో 144వ సెక్షన్ అమల్లో ఉంది. క్షతగాత్రుడిని 108లో సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేల్పూరు(శావల్యాపురం), : మండలంలోని వేల్పూరు గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఆదివారం ఘర్షణ జరిగింది. ఎస్ఐ చల్లా సురేష్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు కొందరు గంటవారిపాలెం వైజంక్షన్ వద్ద నుంచి గ్రామంలోకి వస్తుండగా అదే సమయంలో వైసీపీకి చెందిన ఎస్సీకాలనీవాసులు ఊరి బయటకు వెళుతున్నారు. ఆ క్రమంలో ఇరువర్గాలవారు ఒకరినొకరు రెట్టించుకోవడంతో ఘర్షణ ప్రారంభమైంది. విషయం తెలుసుకొన్న ఇరువర్గాలవారు ఘటనా స్థలానికి చేరుకొని కొట్లాటకు దిగడంతో గ్రామంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీడీపీ వర్గానికి చెందిన నలుగురికి, వైసీపీ వర్గానికి చెందిన నలుగురికి గాయాలవ్వడంతో వెంటనే వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఎస్ఐ సురేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వారిని వారించి అక్కడి నుండి ఇళ్ళకు పంపించి శాంతి భద్రతలను అదుపులోకి తెచ్చారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు.



గుంటూరులోని ఆలయంలో పూజలు చేస్తున్న రామాంజనేయులు దంపతులు

మొక్కు తీర్చుకున్న ఎమ్మెల్యే బూర్ల దంపతులు

పెదనందిపాడు, జూన్ 9: సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ సాధించిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, జయమ్మ దంపతులు నాగులపాడు సుబ్రహ్మణ్యేశ్వస్వామి దేవస్థానంలో ఆదివారం మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నామినేషన్ ముందు రోజు స్వామి వారిని దర్శించుకుని మొక్కుకున్నారు. అర్చకులు పాటిబండ్ల త్రినాథ్‌శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజానీకానికి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బూర్ల దంపతులకు స్వామి వారి పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ముద్దన నగరాజకుమారి, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, తెలుగురైతు కార్యదర్శి మోపర్తి చెంచయ్య, బండి నాగబాబు, రావి శివ రామకృష్ణయ్య, పెంట్యాల శ్రీధర్, పాటిబండ్ల మురళీ, పాటిబండ్ల రాంబాబు, చాగంటి సత్యహర్ష, ఆళ్ళ ఫణిబాబు, కాంద్రు ప్రసాద్, ఉమా, బండి కిరణ్, మాదినేని శౌరిబాబు, ఆముదాలపల్లి నరేంద్ర భీమినేని రవి పాల్గొన్నారు.

స్వామివారి సేవలో రామాంజనేయులు

గుంటూరు(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా గెలుపొంది న బూర్ల రామాంజనేయులు గుంటూరు 46వ డివిజన్లోని అన్నపూర్ణ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సతీసమేతంగా పూజలు నిర్వహించారు. స్వామిమారి ఆశీర్వాదంతోనే తాను గెలుపొందానన్నారు. తనను గెలిపించిన ప్రజలకు మంచి సేవలందిస్తానని అన్నారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్ ఎన్.బాలాజి, సురేశ్, కోటి, గుడి ఈవో, సభ్యులు పాల్గొన్నారు.



ర్యాంకర్లకు నగదు పురస్కారాలు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

జేఈఈ అడ్వాన్స్‌లో

సత్తాచాటిన భాష్యం విద్యార్థులు

● నగదు పురస్కారాలు అందించిన చైర్మన్ భాష్యం రామకృష్ణ

గుంటూరు(విద్య), జూన్ 9: మెరుగైన విద్యాబోధన అందిస్తు దేశానికి ఉత్తమపౌరుల్ని అందించడమే లక్ష్యమని, తద్వారా గుంటూరు ఖ్యాతి జాతీయ స్థాయిలో నిలపడమే భాష్యం విద్యాసంస్థల లక్ష్యమని చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం గుంటూరులోని మెయిన్‌క్యాంపస్‌లో అభినందించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో భాష్యం రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది పది, ఇంటర్, జేఈఈ మెయిన్స్, నీట్ ఇలా విడుదలైన అన్ని ఫలితాల్లో భాష్యం విద్యార్థులు మేటీగా నిలిచారని తెలిపారు. తాజాగా విడుదలైన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో ఎం.సాయియశ్వంత్ రెడ్డి ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయిలో 50వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 62వ ర్యాంకు సాధించారని తెలిపారు. రిజర్వేషన్ కేటగిరిలో ఎం.సాయియశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, పి.గౌతమి 19వ ర్యాంకు, కె.శ్రేయ 23వ ర్యాంకు, కె.జాషువా వివేక్ 26వ ర్యాంకు, జి.జాన్ 36వ ర్యాంకు, ఎం.అర్జున్‌కుమార్ 37వ ర్యాంకు, కె.హర్షిత 43వ ర్యాంకు, కె.చైతన్య 52వ ర్యాంకు, పి.శ్యామ్ 61వ ర్యాంకు, డి. భరత్‌చంద్ర 86వ ర్యాంకులు సాధించారని వివరించారు. ఇంకా జాతీయ స్థాయిలో 100లోపు 12 ర్యాంకులు. 200లోపు 20, 500లోపు 51 , 1000లోపు 86, 2000లోపు 107, 5000లోపు 193 ర్యాంకులు సాధించి సత్తాచాటరని తెలిపారు విద్యార్థులను చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంత రావులు విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన ఎం.సాయియశ్వంత్‌రెడ్డి, ఎం.జిష్ణుసాయిలకు చేరో రూ. 5 లక్షలు నగదు పురస్కారాలు అందజేసి, వారి తల్లిదండ్రుల్ని సత్కరించారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, భాష్యంఐఐటి జేఈఈ అకాడమికోఆర్డినేటర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	152, 161, 173
చికెన్ విత్ స్కిన్	294.00
చికెన్ స్కిన్ లెస్	304.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

స్కేటింగ్ పోటీలకు విశేష స్పందన



పోటీలకు భారీగా హజరైన స్కేటింగ్ క్రీడాకారులు

గుంటూరు(తూర్పు), జూన్ 9: స్కేటింగ్ కోచ్‌స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన స్కేటింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో స్కేటింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలో పాల్గొన్నప్పుడే క్రీడాకారులలో దాగివున్న ప్రతిభను వెలికితీయవచ్చన్నారు. అసోసియేషన్ నిర్వహక కార్యదర్శి షేక్ ఖాజా మాట్లాడుతూ వివిధ విభాగాలకు చెందిన పోటీల్లో దాదాపు 200 మంది క్రీడాకారులు, పలు అకాడమీలకు చెందిన శిక్షకులు దాదాపు 20 మంది పాల్గొన్నారని తెలిపారు. స్కేటింగ్ శిక్షకులు సలాం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరం



సర్టిఫికెట్స్‌తో క్రీడాకారులు, పాల్గొన్న ఉపాధ్యాయులు

గుంటూరు(తూర్పు), జూన్ 9: స్థానిక మాజేటి గురవయ్య హైస్కూల్ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట, శివాజీ క్రీడా మైదానంలో 40 రోజులుగా జరిగిన వేసవి అథ్లెటిక్ శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. కార్యక్రమానికి అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హజరైయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శారదాదేవి మాట్లాడుతూ శిబిరంలో దాదాపు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారని వివరించారు. అనంతరం క్రీడాకారులకు సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ క్రీడాకారులు కిషోర్, వెంకటేశ్వరమ్మ, ప్రవీణ, సాదిక్, మనోజ్, పాఠశాల పీఈటీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావ వేడుకలు

గుంటూరు(విద్య), జూన్ 9: స్థానిక కంకరగుంటలోని ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం సంఘం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎస్టీయూ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు, ఏఐ ఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల అనేక సమస్యల పరిష్కారంలోను, ఉపాధ్యాయులకు వివిధ సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వంతో పోరాడి సాధించటంలో విశేష కృషి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ షేక్ బాజీ, డీఏ జోసఫ్, ఆర్థిక కార్యదర్శి ఎల్ వీరాంజనేయులు, జిల్లా సీనియర్ నాయకులు పి.శ్రీనివాసరావు, పి.ప్రసాద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి సిటీ, జూన్ 9: పెదవడ్లపూడి విద్యుత్ ఉప కేంద్రంలోని 3.15 ఎంవీఏ సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. ఈ కారణంగా పెదవడ్లపూడి, చినవడ్లపూడి, కొత్తపాలెం గ్రామాలకు మెల్లెంపూడి విద్యుత్ ఉపకేంద్రం నుంచి విద్యుత్ సరఫరా చేస్తామని, ఆయా ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సర ఫరాలో అంతరాయం కలిగే అవకాశం ఉందని చెప్పారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేయాల్సిందే

గుంటూరు, జూన్ 9: రాష్ట్రంలో వివాదాస్పదంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయాలని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామన్న చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

చంద్రబాబుతోనే మహిళలకు స్వావలంబన

● ఎమ్మెల్యే గల్లా మాధవి



ఎమ్మెల్యే మాధవిని సన్మానిస్తున్న నన్నపనేని రాజకుమారి తదితరులు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, మహిళల స్వావలంబన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. గుంటూరులోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ మహిళలు ఆదివారం మాధవి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో 33 శాతం రిజర్వేషన్, డ్వాక్రా సంఘాల ఏర్పాటు వంటి కార్యక్రమాలతో మహిళా సాధికారతకు చంద్రబాబు కృషి చేశారన్నారు. చంద్రబాబు ప్రకటించిన మహాశక్తి కార్యక్రమం చరిత్రాత్మక నిర్ణయమన్నారు. ఆయనతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. గుంటూరులో ఆదివారం జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల అంధవిద్యార్థుల చదరంగ పోటీలకు ఆమె హాజరయ్యారు. తన ప్రసంగంతో వారిలో స్ఫూర్తిని నింపారు.

● ఎమ్మెల్యేగా గెలుపొందిన గల్లా మాధవికి జబర్దస్త్ బృందం అభినందనలు తెలిపారు. గుంటూరులోని ఆమె కార్యాలయానికి వచ్చిన ఇమ్మానియేల్ బృందం మాధవి గెలుపుపై హర్షం వ్యక్తం చేశారు.

పోలేరమ్మకు గల్లా మాధవి పూజలు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి ఏటీ అగ్రహారం నాలుగో లైనులో ఉన్న పోలేరమ్మవారి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దీవెన, ప్రజల ఆశీస్సులతోనే తాను గెలుపొందానని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆమెను శాలువాతో సన్మానించారు.

● గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవికి పలువురు టీడీపీ నేతలు అభినందనలు తెలిపారు. నియోజకవర్గం పరిధి లోని పలు డివిజన్లకు చెందిన టీడీపీ నాయకులు ఆమెను కలిసి సన్మానించారు. ఆమెకు స్వీట్లు తినిపించి సందడి చేశారు.

కూటమి విజయంతో మొక్కు చెల్లించుకున్న నేతలు



పాదయాత్ర చేస్తున్న ఎన్‌డీఏ కూటమి కార్యకర్తలు

గుంటూరు, జూన్ 9: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలని, గుంటూరు ఎంపీగా డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గల్లా మాధవి విజయం సాధించాలని మొక్కుకున్న కూటమి నేతలు, కార్యకర్తలు ఆదివారం తమ మొక్కు తీర్చుకున్నారు. రామాలయం నుంచి గోవిందాలయం వరకు పాదయాత్ర చేస్తామని మొక్కుకున్న వీరు.. ఆదివారం సంపత్‌నగర్‌లోని రామచంద్రాపురం నుంచి పాదయాత్రగా బయలుదేరి తుళ్లూరు మండలం అనంతవరంలోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం వరకు నడిచి వెళ్లారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతో చారిత్రక విజయం సాధించిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి రాష్ట్రంలో, కేంద్రంలో చక్కటి ప్రజారంజక పాలన అందించాలని ఆకాంక్షించారు. అనంతరం రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు ఆళ్ల హరి, పెద్ద నాగరాజు, గల్లా జానకీరామ్, ఆవుల సాంబశివరావు, హుస్సేన్, బాలజీ, బద్రినారాయణ, మణికంఠరెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పునీత ఆంథోనీ వార్షిక వేడుకలు



దివ్యబలి పూజలో సందేశమిస్తున్న బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య

గుంటూరు, జూన్ 9 : కోరిన కోరికలు తీరుస్తూ పునీత ఆంథోని భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారని బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఈ మేరకు పునీత ఆంథోనీ 34వ వార్షిక వేడుకలు నగరంపాలెంలోని చర్చి ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య మాట్లాడుతూ విశ్వాసుల కోరికలను తీర్చే ఆంథోనీ వారి వార్షిక వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. నేడు తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా వెలసిల్లి విరాజిల్లుతుందన్నారు. దైవ ప్రణాళికలో భాగంగా ఆంతోని వారి అద్భుతం, ప్రియతమ పీఠాధిపతుల దార్శనికత ఆశీస్సుల కారణముగా ఈనాడు నూతన విచారణ గురువులుగా పుణ్యక్షేత్రం రెక్టరుగా. కొచ్చెర్ల జ్యోతిరాజ్ ఈ నెల 3న బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆ వెంటనే పుణ్యక్షేత్రం 34వ వార్షిక మహోత్సవానికి ప్రాంగణమంతా నయనానందకరంగా తీర్చిదిద్దారంటూ భాగ్యయ్య అభినందించారు. ముందుగా పురవీధుల్లో ఆంథోనీ వారి తేరు ఊరేగింపు వైభవంగా జరిగింది. వేడుకలకు పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొచ్చర్ల జ్యోతి రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు పిల్లి ఆంథోనీ, చిన్నయ్య, రాజారెడ్డి, పుట్టి సుందరరాజు, ఇన్నారెడ్డి, గోవింద రాయన్న, సహాయక గురువులు నందిపాము రాజేష్, కౌన్సిల్ మెంబర్స్ ఎన్‌జీ ప్రకాష్‌రావు, జె.జె.సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు యోగా సభ్యుల నివాళి



రామోజీరావుకు నివాళి అర్పిస్తున్న యోగా సభ్యులు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఈనాడు గ్రూపు సంస్థల చైర్మన్ రామోజీరావు మరణంపై రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులు సంతాపదినాలుగా ప్రకటించడంతో టీడీపీ గుంటూరు జిల్లా కార్యాలయంలో సంతాప కార్యక్రమాలు నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య మాట్లాడుతూ జర్నలిజం, సినీ రంగాలతో పాటు వివిధ వ్యాపారాలు, ప్రత్యేకించి తెలుగు బాష కోసం ఆయన చేసిన కృషి మరిచిపోలేమన్నారు. షేక్ చిన్నబాజీ, బత్తుల శ్రీను, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● రామోజీరావు మరణం తీరని లోటని యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు అన్నారు. రామోజీరావు మృతికి సంతాపంగా యోగా సభ్యులు మూడు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో కూనంనేని వెంకట రమణ, యోగా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నసీర్‌ను సన్మానించిన దాసరి రాజామాస్టారు



నసీర్‌ను సన్మానిస్తున్న రాజామాస్టారు, కుటుంబ సభ్యులు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తూర్పు నియోజకవర్గంలో గెలుపొందిన మొహమ్మద్ నసీర్‌ను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాసరి రాజా మాస్టారు సన్మానించారు. నెహ్రూనగర్‌లోని రాజామాస్టారు ఇంటికి వచ్చి నసీర్ మర్యాద పూర్వకంగా వచ్చిన సందర్భంగా రాజా మాస్టారు, కుటుంబసభ్యులు చదలవాడ శ్రీదేవి, దాసరి తేజస్విని ఆయనను సన్మానించారు. మైనార్టీ కోటాలో నసీర్‌కు ఉన్నత అవకాశం లభించాలని ఆయన ఆకాంక్షించారు.

నసీర్‌కు వాకర్ అసోసియేషన్ అభినందనలు

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌కు పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు. నెహ్రూనగర్ వాకర్ అసోసియేషన్ సభ్యులు నసీర్‌కు సన్మానం చేశారు. ఆ తరువాత తాపీ మేస్త్రీల సంఘం నేతలు మర్యాద పూర్వకంగా కలిసి నసీర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ నేతలు దుర్గారావు, ఎర్రగోపు నాగేశ్వరరావు, వేములకొండ శ్రీనివాస్, సాయి, శంకర్, వాణి, అల్లం బాజీ, దురశల శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నసీర్‌కు మంత్రి పదవి ఇవ్వాలి : ప్రజాసేవా సమితి పార్టీ

గుంటూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ప్రజా సేవాసమితి పార్టీ నేతలు కోరారు. నగరంలో నిర్వహించిన సేవా సమితి జిల్లా సమావేశంలో షేక్ రహీం, సికిందర్, మహమ్మద్ అలీ, సాదిక్, తాతారావు, బాబు మొదలైనవారు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో సంబరాలు

గుంటూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ మూడో సారి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎన్‌డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు తిలకించారు. ఆదివారం సాయంత్రం మోదీ బాధ్యతలు తీసుకొంటున్న సమయంలో కూటమి కార్యకర్తలు భారత్ మాతాకీ జై అనే నినాదాలతో కార్యాలయం హోరెత్తింది. కార్యక్రమం అనంతరం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాళ్ళ అనంత పద్మనాభరావు సభాధ్యక్షత వహించగా సీనియర్ నాయకులు వనమా పూర్ణచంద్రరావు, జూపూడి రంగరాజు, మాజీ మంత్రివర్యులు శనక్కాయల అరుణ, పార్లమెంటు కన్వీనర్ భీమినేని చంద్ర శేఖర్, తూర్పు అసెంబ్లీ కన్వీనర్ ఉమాశంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీతో దేశాభివృద్ధి : శనక్కాయల ఉమాశంకర్

గుంటూరు(తూర్పు), జూన్ 9: దేశప్రధానిగా మోదీని ఎన్నుకోవడం ప్రజలు తీసుకున్న గొప్ప నిర్ణయమని తూర్పు బీజేపీ కన్వీనర్ డాక్టర్ శనక్కాయలు శంకర్ అన్నారు. ప్రధానిగా మూడోసారి మోదీ ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా ఆదివారం ఐదో మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఉమా శంకర్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం పురోగమిస్తుందని ఆకాంక్షించారు. గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్‌కు క్యాబినెట్‌లో చోటు కల్పించడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతకు ముందు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో కో కన్వీనర్ రఫీ, నాయకులు నరేష్, సురేష, వెంకటప్పయ్య, వెంకటేశ్వరరావు, శంకర్, సాంబశివరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

నృసింహుని సేవలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రామకోటిరెడ్డి

మంగళగిరి, జూన్ 9: పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని లక్ష్మీ నృసింహ స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలను అందించగా, దేవదాయశాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే ధూళిపాళ్ల విలేకర్లతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అధర్మంపై ధర్మం విజయం సాధించిందన్నారు. మంగళగిరిలో లోకేశ్ 90 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొంది చరిత్ర సృష్టించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలన అందిస్తామని స్పష్టం చేశారు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విజయభేరి



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఈమని దుర్గాప్రసాద్ తదితరులు

గుంటూరు(విద్య),జూన్ 9: ఐఐటీలు, ఎన్ఐటీల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో ఎన్‌టీఏ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) విడుదల చేసిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరు జోన్ నుంచి కె.సుమంత్‌రెడ్డి 44వ ర్యాంకు, పి.పవన్‌కుమార్ 88, బి.అనిల్‌నాయక్ 129, డి.వైశాలి 155, కె.లోకేష్ 185, జి.బిల్వీక 318, పి.జ్యోతిక 423, కె.తేజవర్ధన్ 591, కె.విష్ణుసాయినాథ్ 620 ర్యాంకులు సాధించారని తెలిపారు. అదేవిధంగా 1000లోపు 20, 2వేల లోపు 32, 5వేలలోపు 62 మంది, 10వేలలోపు 121 మందిర్యాంకులు సాధించారని తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఏజీఎం దుర్గాప్రసాద్, డీన్స్ కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, కిష్ర, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

వీరమహిళల పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జూన్ 9: పిఠాపురంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ భారీ విజయం సాధించడంతోపాటు పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేన అభ్యర్థులు గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ జనసేన వీరమహిళలు, నాయకులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయం వద్ద నుంచి విజయవాడ ఇంద్రకీలాద్రిలో కొలువైన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధి వరకు పాదయాత్రగా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొలుత మంగళగిరిలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. జనసేన తాడేపల్లి మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర జరిగింది.

గ్రామాల్లో విజయోత్సవాలు



పాలపర్రులో విక్టరీ చూపుతున్న తెలుగు మహిళలు

పెదనందిపాడు, జూన్ 9 : టీడీపీ అధికారంలోకి రావడంతో మండల పరిధిలోని పాలపర్రు, పరిటాలవారిపాలెం, వరగాని గ్రామాల్లో విజయోత్సవాలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, ఎన్టీఆర్ విగ్రహ, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

చరిత్ర సృష్టించిన ఎన్‌డీఏ కూటమి

● ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



బండారుపల్లిలో మొక్కులు చెల్లించుకోవటానికి వచ్చిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జూన్ 9: రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ఎన్నికల్లో విజయం సాధించి చరిత్ర సృష్టించిందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజార్టీతో విజయం సాధించటంతో పాటు, నారా చంద్రబాబునాయుడు సీఎం అవ్వటంతో ఆదివా రం బండారుపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు విజయోత్సవాలు నిర్వహించడంతో పాటు, గ్రామదేవత ఆలయంలో మొక్కులు చెల్లించారు. ఆలయంలో మొక్కులు చెల్లించడానికి వచ్చిన శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, రాజధాని నిర్మాణానికి చంద్రబాబు పనులు మొదలు పెట్టారన్నారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో గుంటుపల్లి పానయ్య, గుంటుపల్లి సాయిశంకర్, డి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

● తాడికొండలో టీడీపీ సీనియర్ నాయకులు ఎడ్డూరి హనుమంతరావు ఆధ్వర్యంలో చంద్రబాబునాయుడు సీఎం అవ్వటంతో పాటు, ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించటంతో స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో 111 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కంతేటి నాగేశ్వరరావు, దూళిపాళ్ల ఏసుబాబు, మన్నె బాబు, ఎడ్డూరి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

తెలుగు హనుమాన్ చాలీసా పారాయణం

గుంటూరు(తూర్పు), జూన్ 9: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదిక పై ఆదివారం తెలుగు హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు 1.12లక్షల నగదు

దుగ్గిరాల, జూన్ 9: గతేడాది మార్చిలో జరిగిన పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు 17మందికి రూ.1.12లక్షల నగదు విశ్రాంత ఉపాధ్యాయుల, ఉపాధ్యాయుల సమాఖ్య బృందం అందించారు. మండలగ్రామం పెదపాలెం హైస్కూల్లో పదోతగతి పరీక్ష ఫలితాల్లో, ప్రథమ స్థానం సాధించిన బుల్లా అరుణ్‌తేజ్, లాం షైనీ మధురిమలకు రూ.7వేల చొప్పున మరో 15 మందికి రూ.6000 చొప్పున నగదును అందిచారు. ఎస్టీయూ నాయకుడు బుల్లా మరియదాసు, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ విశ్రాంత జనరల్ మేనేజర్ కె. నాగేశ్వరరావు, పశువైద్యశాఖ ఏడీ పులి రవి, డాక్టర్ ఎల్ రత్నకుమారి, బి. సంజయ్‌కుమార్, కె.రాజశేఖర్, కె.నవ్య తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటంతో సంబరాలు

తుళ్లూరు, జూన్ 9: దేశ ప్రధానిగా నరేంద్రమోదీ ఢిల్లీలో ఆదివారం సాయంత్రం మూడోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు మంత్రులు, సహాయక మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. గుంటూరు టీడీపీ ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయక మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయటంతో రాజధాని అమరావతిలో జనసేన , బీజేపీ టీడీపీ కూటమి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

వట్టిచెరుకూరు, జూన్ 9: డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌ను కేంద్ర సహాయ మంత్రి పదవి వరించడంపై మండల పరిధిలోని దేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి.

పోతినేనికి టీడీపీ నేతల అభినందనలు



పోతినేని శ్రీనివాసరావును అభినందిస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, జూన్ 9: మంగళగిరిలో నారా లోకేశ్ ఘన విజయం సాధించడంలో విశేషంగా కృషి చేసిన టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావును పలువురు టీడీపీ నేతలు ఆదివారం కలిసి అభినందనలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, తోట సాంబయ్య, నేతలు చింకా కోటేశ్వరరావు, ఆలా వెంకట నారాయణ, దానబోయిన శంకరరావు, గోడితల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



విద్యార్థినికి ఉపకార వేతనాలు అందిస్తున్న రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ సభ్యులు

ఉన్నత విద్యతో అత్యున్నత శిఖరాలకు...

● మంగళగిరి అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతి

తెనాలి, మారీసుపేట జూన్ 9: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన ఉన్నత విద్యతో అత్యున్నత శిఖరాలను అధిరోహించవచ్చునని మంగళగిరి అసిస్టెంటు కమిషనర్ వల్లూరి లక్ష్మీపతి అన్నారు. పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆదివారం రజక వలంటీర్ సర్వీస్ సొసైటీ సభ్యులు 7వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంగళగిరి అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్య ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలను సాధించిన 80 మంది విద్యార్థిని, విద్యార్థులకు రూ.2000 చొప్పున ఉపకార వేతనాలను, కాలేజీ బ్యాగ్‌లు, నోట్ బుక్స్, మెటీరియల్స్ అందించారు. పల్నాడు రజక ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పేటేటి శ్రీనివాస్, నాంచారయ్య, వెంకటేశ్వరావు, శివనాగేశ్వరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

తెనాలి, మారీసుపేట జూన్ 9: స్థానిక బోసురోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదాత సుఖీభవ తెనాలి వారి ఆధ్వర్యంలో చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఆదివారం అన్నదాత సుఖీభవ సభ్యులు రామచంద్రమూర్తి, బాలమీనాక్షి దంపతులు, వారి కుమారుడు, కోడలు వెంకట వంశీకృష్ణ, రాజ్యలక్ష్మిల సహకారంతో చల్లని మజ్జిగను, మంచినీరును పాదచారులకు, పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కో శ్రీనివాసరావు, కుర్రా శ్రీనివాసరావు, వివి ప్రతాప్, పోతరాజు, బాలునాయక్, శ్రీను, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



కళాకారుల నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న సినీ రచయిత సాయి మాధవ్ తదితరులు


కళాకారుల సంఘ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

తెనాలి, మారీసుపేట జూన్ 9: తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘ కార్యాలయంలో రంగస్థల కళాకారుల సంఘ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. స్థానిక బీసీ కాలనీలోని పట్టణ రంగస్థల కళాకారుల సంఘ కార్యాలయంలో ఆదివారం సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ పాల్గొని సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిచారు. నూతన కార్యవర్గ సభ్యులుగా సంఘ అధ్యక్షులుగా బుర్రా జయలక్ష్మి, గౌరవాధ్యక్షుడుగా ఆరాధ్యుల కోటేశ్వరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ, కార్యనిర్వహణ కార్యదర్శి ఎం రామలింగేశ్వరావు, కోశాధికారి దీపాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా బెజ్జంకి నాగమణి, నిర్మలారమేష్‌లను నియమించారు. మిగతా సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా బుర్రా సాయిమాధవ్, చెరుకుమిల్లి సింగారావు, షేక్ జానిబాషా, న్యాయ సలహాదారులుగా హరిదాసు గౌరిశంకర్, గౌరవ సలహాదారులుగా ఉప్పాల రాజేరశ్వరావు, అయినాల మల్లేశ్వరావు, టీవీఎస్ శాస్త్రి, కనపర్తి బాబురావు, గోగినేని కేశవరావు, బొల్లిముంత కృష్ణ, చిట్టూరి సీతారామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం సీనియర్ కళాకారులు దీపాల సుబ్రహ్మణ్యంను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

13వరకు పెదకాకాని రైల్వే గేట్ మూసివేత

పెదకాకాని, జూన్ 9 : నేటి నుంచి 13వ తేదీ వరకు పెదకాకాని రైల్వే గేటు మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు ఆదివారం తెలిపారు. గేటు మూసివేతనట్లు కూడా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. రైల్వే గేటు, రోడ్డు మరమ్మతులు చేపడుతున్నందున ఈ గేటు మూసివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



ప్రజా సేవకులమన్న భావనతో పనిచేయండి..

● నాదెండ్ల మనోహర్



వ్యర్థాలతో నిండిఉన్న మురుగు కాలువలను పరిశీలిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, జూన్ 9: ప్రజల సేవకులమన్న భావనతో చిత్తశుద్ధితోపనిచేసి తెనాలి ప్రాంతాన్ని స్వచ్ఛతెనాలిగా తీర్చిదిద్దాలని తెనాలి ఎమ్మెల్యేగా గెలుపొందిన నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు మురుగు డ్రెయిన్లను మునిసిపల్ అధికారులతో కలిసి మనోహర్ పరిశీలించారు. పలు డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలతో నిండి ఉండటాన్ని గమనించి అధికారులకు పలు సూచనలు చేశారు. గత ప్రభుత్వంలో ఏ విధంగా పనిచేశారో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను చూస్తే ఇట్టే అర్థమవుతుందన్నారు. కాలువల్లో మురుగు నీరుకి బదులు ప్లాస్టిక్ వ్యర్థాలు నిండి ఉంటే నీరు ప్రవహించకపోగా రోడ్లపైకి చేరి దుర్గంధం వెదజల్లుతూ దోమలు వృద్ధి చెంది తద్వారా ప్రజలకు అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం పొంచి ఉందన్నారు. మునిసిపాలిటీ అధికారులు ప్రతిరోజు శానిటేషన్ సిబ్బందితో కాలువల్లో వ్యర్థాలు తొలగింపు పనులు చేస్తున్నారని చెబుతున్నారని అది వాస్తవమైతే ఇన్ని వ్యర్థాలు ఎలా పేరుకుపోతాయని ప్రశ్నించారు. వర్షాకాలం సమీపిస్తుందని కాలువల్లో ఉన్న వ్యర్థాలను రానున్న 15 రోజుల్లో పూర్తిగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. గత ఐదేళ్లుగా రైతులకు పంట కాలువలు పూర్తిస్థాయిలో పూడికలు తీయకపోవడంతో వర్షం వస్తే పంట పొలాల్లో నీరు బయటకు పోక పంటలు నష్టపోయిన పరిస్థితి అన్నదాతలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఇరిగేషన్ అధికారులు కూడా తప్పనిసరిగా పంట కాలువలను పరిశీలించి తక్షణమే పూడిక తీసే పనులు చేపట్టి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి పరిష్కరించేలా యంత్రాంగం పనిచేయాలని లేనిపక్షంలో తగిన చర్యలు తప్పవని మనోహర్ హెచ్చరించారు.

కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ శేషన్న, పలువురు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని, నాదెండ్ల సారథ్యంలో.. అభివృద్ధి సంక్షేమం

వీరవల్లి మురళి

తెనాలి రూరల్, జూన్ 9: కేంద్రసహాయ మంత్రిగా పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన పీఏసీ చైర్మన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ల సారథ్యంలో మన ప్రాంతం అభివృద్ధి, సంక్షేమంతో దూసుకుపోనుందని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. ఆదివారం మండలంలోని సంగంజాగర్లమూడిలోని శ్రీ వినాయక స్వామి వారి ఆలయంలో పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్ గెలుపును పురస్కరించుకుని 101 టెంకాయలు స్వామి వారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరమాచనేని వెంకటేశ్వరావు, తోట శ్రీనివాస్, అంగలకుదురు (బొద్దులూరి వేణు, సాయిగిరి, రవిబాబు, కనగాల పిచ్చయ్య, ఎల్ఎంఎల్ ఖాదర్, సిద్ధాంతి శ్రీనివాసరావు, హనుమానాయక్, మహేష్‌నాయక్, మందరపు శ్రావణ్‌కుమార్ తదితులు పాల్గొన్నారు.



సంగంజాగర్లమూడిలో వినాయకస్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మురళి, నాగభూషణం తదితరులు

తెనాలిలో పూజలు

సార్వత్రిక ఎన్నికలలో కూటమి తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా నాదెండ్ల మనోహర్ అత్యధిక మెజార్టీతో విజయం సాధించడంతో జనసేన పార్టీ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని వీఎస్ఆర్ కళాశాల వద్ద గల వినాయకుని విగ్రహం వద్ద ఆదివారం జనసేనపార్టీ నాయకుడు పోలిశెట్టి శివప్రసాద్ ఆధ్వర్యంలో వినాయకుని విగ్రహం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో హరిదాసు గౌరిశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, బండారు రవికాంత్, యర్రు వెంకయ్యనాయుడు, కోటా పున్నారావు, చట్లా శివకుమార్, షేక్ మల్లికా బేగం, సాయి, కృష్ణ, రాజు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసానికి సహాయమంత్రి పదవిపై హర్షం

తెనాలి రూరల్, జూన్ 9: గుంటూరు కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర సహాయ మంత్రిగా అవకాశం ఇవ్వడం తమకు చాలా సంతోషంగా ఉందని, గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకుడు వీరవల్లి మురళి చెప్పారు. వైసీపీ ఐదేళ్లపాలనలో ఈ ప్రాంతంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని రాబోయే రోజుల్లో అందరికీ మంచి జరిగేలా పెమ్మసాని చంద్రశేఖర్ పాలన ఉంటుందన్నారు.

బుర్రిపాలెంలో సంబరాలు

గుంటూరు ఎంపీగా గెలిచిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర సహాయ మంత్రిగా పదవి దక్కడంపై ఆయన స్వగ్రామం బుర్రిపాలెంలో సంబరాలు జరిపారు. కూటమి పార్టీ శ్రేణులు మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్ సొంతగడ్డకు సేవ చేయాలన్న కోరికతో ఇక్కడకు రావడం జరిగిందని చెప్పారు. తొలిసారిగా రాజకీయ నాయకుడిగా ప్రజల్లో ఎంతో ఆదరణ పొంది అధిష్టానం చేతకూడా కేంద్రసహాయ మంత్రి హోదా దక్కించుకోవడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.

తెనాలి పెమ్మసాని థియేటర్ వద్ద సందడి

తెనాలి పట్టణంలోని పెమ్మసాని థియేటర్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎంపీగా గెలుపొందిన పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణం చేయనున్న సందర్భంగా ఆ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం చేశారు. దీంతో కూటమి నాయకులు, కార్యకర్తలు ఒక్క చోటే చేరి కార్యక్రమాన్ని వీక్షించారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది..

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం

పెదకాకాని, జూన్ 9: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1993-95 సంవత్సరంలో రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్రం చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు హాజరయ్యారు. సభకు రాజనీతి శాస్త్ర అధిపతి అంజిరెడ్డి అధ్యక్షుడు లక్ష్మణరావు మాట్లాడుతూ చాలాకాలం తర్వాత పూర్వ విద్యార్థులంతా ఒకచోట కలుసుకోవటం ఎంతో ఆనందకరమన్నారు. కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ విజిలెన్స్ కలెక్టర్ పద్మ దేవి, విశ్రాంతి ఆచార్యులు నారాయణ, భవాని, ఆర్ఆర్ లక్ష్మీకాంతం, అప్పటి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మనోహర్‌ను సత్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘ సభ్యులు

నాదెండ్లకు బీసీ నేతల అభినందనలు

తెనాలి, మారీసుపేట జూన్ 9: తెనాలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అఖండ విజయాన్ని సాధించిన నాదెండ్ల మనోహర్‌ను తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ సభ్యుల కలసి అభినందనలు తెలిపారు. స్థానిక బోసురోడ్డులోని జనసేనపార్టీ కార్యాలయంలో ఆదివారం మనోహర్‌ను తెనాలి నియోజకవర్గ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన కోటేశ్వరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ అన్నవరపు నాగమల్లేశ్వరావులు మర్యాదపూర్వకంగా కలసి దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర యువత ఉపాధ్యక్షుడు కొల్లి హనుమంతరావు, పట్టణ కార్యదర్శి వేముల కృష్ణ, బీసీ నాయకులు జొన్నాదుల వెంకటసాయి, మురళి, పోలిశెట్టి వెంకటేశ్వరావు, శ్రీను, స్వాములు, సుబ్బారావు, ప్రసాద్, వీరాచారి, సాయి తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ హక్కుల సమితి అధ్యక్షుడిగా జాఫర్

పొన్నూరు టౌన్, జూన్ 9: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడిగా సైయ్యద్ జాఫర్ నియమితులైయ్యారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారూక్ షుబ్లీ ఆదివారం జాఫర్‌కు నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా జాఫర్ నిరుపేద ముస్లింల సంక్షేమంకోసం పాటుపడుతానన్నారు.

మొక్కులు తీర్చుకుంటున్న టీడీపీ నాయకులు

పెదకాకాని, జూన్ 9: పొన్నూరు నియోజక వర్గంలో ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అత్యధిక మెజారిటీతో విజయం సాధించాలని, చంద్రబాబు నాయుడు తెలుగు దేశం అధికారంలోకి రావాలని మొక్కు మొక్కుకున్న నంబూరు తెలుగుదేశం పార్టీ నాయకుడు కోడూరు కనకరాజు ఆదివారం మొక్కుబడి తీర్చుకున్నారు. ఆర్‌సీఎం చర్చ్ ఫాదర్ రెవరెండ్ ఫాదర్ నవీన్ కుమార్ సమక్షంలో గుణదల మేరీమాత కొండపై మొక్కు తీర్చుకున్నారు. తొలుత మేరీమాత చర్చిలో ఫాదర్ నవీన్ ప్రత్యేక కృతజ్ఞత ప్రార్ధన గావించి,ఆశీర్వదించారు. అనంతరం మేరి క్షౌర శాలలో మొక్కు తీర్చుకొని, ఆలయంలో కొబ్బరికాయ కొట్టి కానుకలు సమర్పించారు.

పాదయాత్రగా బగళాముఖి ఆలయానికి

పొన్నూరు టౌన్, జూన్ 9: పొన్నూరు ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అఖండ మెజార్టీతో గెలవటంతో ఆదివారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు మొక్కుబడుళ్లు తీర్చుకున్నారు. పట్టణం నుంచి పాదయాత్రగా బయల్దేరి టీడీపీ మహిళా నేతలు, కార్యకర్తలు నిడుబ్రోలు మీదుగా సంగుపాలెంకోడూరు, చందోలు వరకు పాదయాత్ర నిర్వహించి చందోలులోని మహిమాన్విత పుణ్యక్షేత్ర బంగళాముఖి అమ్మవారి క్షేత్రానికి చేరుకున్నారు. బంగళాముఖి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ తరపున మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణ, మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పట్టణంలో పాదయాత్రగా వెళుతున్న టీడీపీ నాయకులు

రామోజీరావుకు టీడీపీ నాయకుల నివాళి

కొల్లిపర, జూన్ 9: మీడియా రంగంలో తనకంటూ ప్రత్యేకస్థానం సంపాదించుకుని ప్రజల గుండెల్లో చిరస్థాయిగా రామోజీరావు నిలిచిపోయినట్లు టీడీపీ తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర టీడీపీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పలువురు టీడీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ రామోజీరావు మృతి బాధాకరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, షేక్ రఫీ, ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, వల్లభాపురం బసవయ్య, విస్సారపు శ్రీను, జొన్నల నాగిరెడ్డి, ఆరిమండ వెంకటరెడ్డి, జొన్నల బసివిరెడ్డి, కటారి కిరణ్, కొల్లిపర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



రామోజీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



అబాకస్‌లో శిక్షణ పొందిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

అబాకస్‌తో గణితం సులభతరం

పొన్నూరు టౌన్, జూన్ 9: గణిత పాఠాలను అబాకస్ గణిత పాఠాలను సులభతరంగా నేర్చుకోవచ్చని కీర్తి హస్పటల్స్ శివ కుమార్ అన్నారు. యూసీఎంఏఎస్ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణలో భాగంగా 13 ఏళ్ల బాల బాలికలకు అబాకస్‌పై శిక్షణ నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జ్ఞాపికలు అందచేశారు. ఈ సందర్భంగా యూసీఎంఏఎస్ నిర్వాహకురాలు కె అనూష, డాక్టర్ కీర్తి, ఎ.వెంకటేశ్వరావు, డాక్టర్ లక్ష్మీకుమారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పునీత ఆంథోనీ వార్షిక వేడుకలు

గుంటూరు, జూన్ 9: కోరిన కోరికలు తీరుస్తూ పునీత ఆంథోని భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారని బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య అన్నారు. ఈ మేరకు పునీత ఆంథోనీ 34వ వార్షిక వేడుకలు నగరంపాలెంలోని చర్చి ఆవరణలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గుంటూరు మేత్రాసన పీఠాధిపతి బిషప్ చిన్నాబత్తిన భాగ్యయ్య మాట్లా డుతూ విశ్వాసుల కోరికలను తీర్చే ఆంథోనీ వారి వార్షిక వేడుకల్లో పాల్గొ నడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. నేడు తెలుగు రాష్ట్రాలలో ప్రముఖ అధ్యాత్మిక క్షేత్రంగా వెలసిల్లి విరాజిల్లుతుందన్నారు. దైవ ప్రణాళికలో భాగంగా ఆంతోని వారి అద్భుతం, ప్రియతమ పీఠాధిపతుల దార్శనికత ఆశీస్సుల కారణంగా ఈనాడు నూతన విచారణ గురువులుగా పుణ్యక్షేత్రం రెక్టరుగా. కొచ్చెర్ల జ్యోతిరాజ్ ఈ నెల 3న బాధ్యతలు స్వీకరించారన్నారు. ఆ వెంటనే పుణ్యక్షేత్రం 34వ వార్షిక మహోత్సవానికి ప్రాంగణ మంతా నయనానందకరంగా తీర్చిదిద్దారంటూ భాగ్యయ్య అభినందించా రు. ముందుగా పురవీధుల్లో ఆంథోనీ వారి తేరు ఊరేగింపు వైభవంగా జరిగింది. వేడుకలకు పుణ్యక్షేత్ర విచారణ గురువు ఫాదర్ కొచ్చర్ల జ్యోతి రాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు పిల్లి ఆంథోనీ, చిన్నయ్య, రాజారెడ్డి, పుట్టి సుందరరాజు, ఇన్నారెడ్డి, గోవింద రాయన్న, సహాయక గురువులు నందిపాము రాజేష్, కౌన్సిల్ మెంబర్స్ ఎన్‌జీ ప్రకాష్‌రావు, జె.జె.సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని దర్శించుకున్న ధూళిపాళ్ల నరేంద్ర



ధూళిపాళ్ల నరేంద్రకు జ్ఞాపిక అందజేస్తున్న ఈవో రామకోటిరెడ్డి

మంగళగిరి, జూన్ 9: పొన్నూరు శాసనసభ్యుడుగా గెలిచిన ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆదివారం మంగళాద్రి క్షేత్రాన్ని దర్శించారు. దిగువ సన్నిధిలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనాలను అందించగా, దేవదాయశాఖ సహాయ కమిషనరు అన్నపురెడ్డి రామకోటిరెడ్డి నృసింహుని చిత్రపటంతో కూడిన జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఆలయం వెలుపల ఎమ్మెల్యే ధూళిపాళ్ల విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో అధర్మంపై ధర్మం విజయం సాధించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్నివర్గాల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడ్డారని, రాష్ట్రం బాగుపడాలన్న ఉద్దేశ్యంతో కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించారని చెప్పారు. మంగళగిరిలో నారా లోకేశ్ 90వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొంది చరిత్ర సృష్టించారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టే విధంగా సుపరిపాలన అందిస్తామని స్పష్టం చేశారు.



నరేంద్ర కుమార్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

నరేంద్రకుమార్‌కు జనసేన నాయకుల సత్కారం

పొన్నూరు టౌన్, జూన్ 9: ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందటంపై జనసేన నాయకులు హర్షం వ్యక్తంచేసి సత్కరించారు. పొన్నూరు పట్టణంలోని 18, 19 వార్డులకు చెందిన జనసేన నాయకులు దేశంశెట్టి సూర్య ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళ్లి ఆదివారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను కలుసుకుని అభినందించారు. నరేంద్రకుమార్‌కు కరవాలాన్ని బహూకరించారు. సత్కరించి మెమొంటో అందించారు. నియోజకవర్గ అభివృద్ధి సంక్షేమం కోసం నరేంద్ర కుమార్ వెంట టీడీపీతో కలిసి పనిచేస్తామని జనసేన నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆకుల గోపి, పి.ప్రసాద్, నాగ మహేష్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య కీర్తనాలాపన

తెనాలి అర్బన్, జూన్ 9: అన్నమయ్య జయంతి పురస్కరించుకుని కొత్తపేట అదితి ఫంక్షన్ హాలులో ఆదివారం కీర్తనాలాపన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో పలువురు గాయకులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. కొండవి వసుంధర, టీవీఎస్ శాస్త్రి, డాక్టర్ పురుషోత్తమరావు, కెవి లలిత, కీర్తన, కార్తీక్, రత్నశ్రీ, సుబ్బారావు, సుచరిత, కీర్తనలు ఆలపించారు. అంజనేయశాస్త్రి, కేవీ రామకృష్ణ, నాగూర్, వెంకటేశ్వరరావు వాయిద్య సహకారం అందించారు.



పేరంటాళ్లమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు, ఆలయం వద్ద శిడిమాను ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

కొల్లిపర, జూన్ 9: మండలంలో దావులూరులోని బాపమ్మ పేరంటాళ్లమ్మ తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులను తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్ళు నిర్వహించి పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అఖండజ్యోతి, పంచామృతాలతో రోకళ్లతో పూజ, గుమ్మడిశిడి, విగ్రహాల గ్రామోత్సవం, మేకశిడి, వైభవంగా జరిగాయి. అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ రవీంద్రరెడ్డి పోలీసు బందోబస్తును నిర్వహించారు.

అట్లాంటాలో సాహిత్యవేత్త సాయికి సత్కారం

తెనాలి అర్బన్, జూన్ 9: అమెరికాలోని అట్లాంటాలో జరిగిన ఆటా సాహిత్య సదస్సులో తెనాలి సాహిత్యవేత్త లక్కరాజు సాయి పాల్గొన్నారు. ఈ నెల 7 నుంచి 9 వరకు మూడు రోజుల పాటు సదస్సులు నిర్వహించారు. 18వ అమెరికన్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభల్లో ఆదివారం విభిన్న స్వరాల వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన సాహిత్య సేవలను గుర్తించిన ఆటా ప్రతినిధులు రవి, సిద్దారెడ్డిలు ఆయనను ఘనంగా సన్మానించారు.